అమ్మకు ప్రేమతో...

'ఈరోజు మా అమ్మ కల నెరవేరింది. ఆమె కోరిక తీరింది. నన్ను కనీ ఇంత వాడ్ని చేసిన అమ్మ రుణాన్ని తీర్చుకోలేను కానీ.. ఏనాటినుంచో అడుగుతున్న అమ్మ చిన్న కోరికను మాత్రం తీర్చగలితాను. అందుకే చాలా ఆనందంగా ఉంది.' అన్నారు జూనియర్ ఎన్టీఆర్. శనివారం ఆయన.. తన తల్లి షాలినీతో కలిసి ఉడుపి శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించారు. దర్శకుడు ప్రశాంత్‌నీల్, కన్నడ నటుడు రిషబ్‌శెట్టి కూడా ఎన్టీఆర్‌తో కలిసి దైవ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ఆలయం ఎదుట తన తల్లితో కలిసి దిగిన ఫొటోలను తారక్ తన ఎక్స్(ట్విటర్) ద్వారా పంచుకుంటూ.. 'మా అమ్మ సొంత ఊరు కర్ణాటక లోని కుందాపురా. అందుకే కుందాపురా వెళ్లి, ఆ తర్వాత ఉడిపి శ్రీకృష్ణుడి ఆలయాన్ని కూడా దర్శించుకోవాలని ఎప్పట్నుంచో అనుకుంటూ ఉండేది. బిజీ వల్ల నాకేమో కుదిరేది కాదు. ఇన్నాళ్లకు అమ్మకోరిక తీర్చాను. సెప్టెంబర్ 2న మా అమ్మ పుట్టినరోజు. ఆ రోజుకు ముందు నేను అమ్మకు ఇచ్చే గొప్ప బహుమతి ఇదే.' అంటూ ట్విటర్ ద్వారా సంతోషాన్ని పంచుకున్నారు తారక్. ఇంకా ఆయన కొనసాగిస్తూ.. 'హోంబలే ఫిల్మ్స్ అధినేత విజయ్ కిరంగదూర్ సార్.. మీకు నా ధన్యవాదాలు. అలాగే ప్రియమిత్రులు రిషబ్‌శెట్టి, ప్రశాంత్‌నీల్ మాతో పాటు కలిసి వచ్చి, ఈ క్షణాలను మరింత ప్రత్యేకంగా మార్చారు' అంటూ ఎక్స్ వేదికగా ఫొటోలను పంచుకున్నారు తారక్. ప్రస్తుతం ఈ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.



విశ్వనాథ్ సినిమా గుర్తొస్తుంది

'మన భారతీయ సమాజంలో 22 ఏండ్లకే పెళ్లెప్పుడని అడుగుతుంటారు. అందుకే హౌస్‌వైఫ్ (గృహిణి) పాత్ర చేయడం ఇబ్బందిగా అనిపించలేదు. ఓ నటిగా అన్ని రకాల పాత్రలు చేయాలన్నదే నా అభిమతం' అని చెప్పింది కథానాయిక నివేతా థామస్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న '35-చిన్న కథ కాదు' ఈ నెల 6న ప్రేక్షకుల ముందుకురానుంది. కిషోర్ ఈమాని దర్శకుడు. ఈ సందర్భంగా శనివారం నివేతా థామస్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు...

- ఈ సినిమాలో నేను సరస్వతి పాత్రలో కనిపిస్తా. మదర్ క్యారెక్టర్ చేయడం సవాలుగా తీసుకున్నా. నటిగా ఓ మూసలో ఇమిడిపోవడం నాకు ఇష్టం ఉండదు. నేను ఎలాంటి పాత్రనైనా చేయగలనని దర్శకులు నమ్మితే అంతకు మించిన ఆనందం ఏముంటుంది (నవ్వుతూ).
- ఈ సినిమాలో సరస్వతికి చిన్న వయసులోనే పెళ్లవుతుంది. తనకు పిల్లలు ఉన్నప్పటికీ ఆమెలో ఇంకా చైల్డ్ నేచర్ కనిపిస్తుంటుంది. తిరుపతి నేపథ్యంలో నడిచే ఈ కథ మధ్యతరగతి భావోద్వేగాలు, సంఘర్షణలకు అద్దం పడుతుంది. తిరుపతి బ్యాక్‌డ్రాప్ కాబట్టి అంతర్లీనంగా ఆధ్యాత్మిక భావాలతో కూడిన ఫ్యామిలీ డ్రామాగా మెప్పిస్తుంది.
- 'తారే జమీన్ పర్' చిత్రంతో ఈ సినిమాకు అస్సలు పోలిక ఉండదు. లెక్కల సబ్జెక్ట్‌లో పిల్లలకు చాలా సందేహాలుంటాయి. ఈ సినిమాలో మా పెద్దబ్బాయికి మ్యాథ్స్ అంటే కష్టంగా అనిపిస్తుంటుంది. ఈ నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతాయి. భార్య, భర్త , పిల్లలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య అందమైన అనుబంధాన్ని ఆవిష్కరిస్తుంది. కె.విశ్వనాథ్‌గారి సినిమా చూసిన అనుభూతినందిస్తుంది.
- ప్రియదర్శి ఈ సినిమాలో లెక్కల మాస్టర్ చాణక్యగా కనిపిస్తారు. గౌతమి, భాగ్యరాజా వంటి సీనియర్స్‌తో నటించడం వల్ల ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నా. సురేష్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను ప్రజెంట్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ప్రస్తుతానికైతే తెలుగులో ఏ సినిమా కన్‌ఫర్మ్ కాలేదు. ఆ వివరాలను త్వరలో తెలియజేస్తా.

ఒక్క శనివారం సరిపోదు

'ఈ సినిమా విడుదల రోజు నుంచే ఎన్నో ప్రశంసలు, అభినందనలు వస్తున్నాయి. థియేటర్స్‌లో ఆడియెన్స్ జోష్ చూసినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. మంచి సినిమాకు తెలుగు ప్రేక్షకులు పట్టం కడతారని మరోసారి నిరూపితమైంది' అన్నారు నాని. ఆయన కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించిన 'సరిపోదా శనివారం' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం థాంక్స్‌మీట్‌ను నిర్వహించారు. నాని మాట్లాడుతూ 'ఇది కేవలం వీకెండ్‌కు మాత్రమే పరిమితమయ్యే సినిమా కాదు. లాంగ్ రన్ ఉండబోతున్నది. ఇంత వర్షంలో కూడా అన్ని కేంద్రాల్లో హౌస్‌ఫుల్స్ అవుతున్నాయి. 'నిన్ను కోరి' తర్వాత నిర్మాత దానయ్యగారి సంస్థలో మరో హిట్ కొట్టడం ఆనందంగా ఉంది. ఈ సినిమా ఒక్క శనివారంతో ఆగిపోదు...ఎన్నో శనివారాలను దాటుకొని వెళుతుంది' అన్నారు. హీరో నాని ఇచ్చిన ఫ్రీడమ్ వల్లే సినిమాను అనుకున్న విధంగా తీయగలిగానని, ఇంత లార్జ్ స్కేల్ ఉన్న సినిమాను నేను తీస్తానని నమ్మిన నిర్మాత దానయ్యగారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని దర్శకుడు వివేక్ ఆత్రేయ చెప్పారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనే ఈ సినిమా భారీ సక్సెస్ ఖాయమని ఊహించానని, ఈ నెల 5న గ్రాండ్ సెలబ్రేషన్స్ నిర్వహించబోతున్నామని నిర్మాత డీవీవీ దానయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీరాజా, సాయికుమార్, కథానాయిక ప్రియాంక మోహన్ పాల్గొన్నారు.

మా జీవితాలను మార్చింది

''గబ్బర్‌సింగ్' అంటేనే ఓ చరిత్ర. మా జీవితాన్ని మార్చేసిన చిత్రమిది. ఎక్కడికి వెళ్లినా ప్రేక్షకులు అభిమానాన్ని చూపించారు. ఇదంతా పవన్‌కల్యాణ్‌గారి గొప్పతనమేనని నమ్ముతున్నా' అన్నారు హరీశ్‌శంకర్. ఆయన దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ హిట్ 'గబ్బర్‌సింగ్' ఈ నెల 2న రీరిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో చిత్ర దర్శకుడు హరీశ్‌శంకర్, నిర్మాత బండ్ల గణేష్ పాల్గొన్నారు. హరీశ్‌శంకర్ మాట్లాడుతూ ''గబ్బర్‌సింగ్' సినిమా ఎవర్‌గ్రీన్. దేవీశ్రీ పాటలకు థియేటర్లు దద్దరిల్లిపోయాయి. ఈ సినిమా డబ్బింగ్ సమయంలో పవన్‌కల్యాణ్‌గారు బ్లాక్‌బస్టర్ హిట్ అని చెప్పారు. నేడు ప్రజాజీవితాలను మార్చడానికి నిర్విరామంగా కృషి చేస్తున్న పవన్‌కల్యాణ్‌గారికి గబ్బర్‌సింగ్ యూనిట్ తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నా' అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, పవన్‌కల్యాణ్ బతుకునిచ్చాడని, తాను ఆర్థికంగా ఎంత స్థాయికి వెళ్లినా పవన్‌కల్యాణ్‌గారు లేకపోతే తనకు ఈ క్రేజ్ ఉండేది కాదని నిర్మాత బండ్ల గణేష్ అన్నారు. ఏడేళ్లుగా సినిమాలు తీయకపోవడం బాధగా ఉందని, మళ్లీ సినిమాలు చేసి బ్లాక్‌బస్టర్ హిట్స్ కొడతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మరోసారి వైవిధ్యంగా..



వైవిధ్యమైన కథాంశాలను ఎన్నుకోవడంలో సిద్ధహస్తుడు నందమూరి కల్యాణ్‌రామ్. ఓ వైపు నటుడిగా ఎదుగుతూ, మరోవైపు ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అభిరుచిగల చిత్రాలను నిర్మిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు కల్యాణ్‌రామ్. ప్రస్తుతం ఆయన ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. విజయశాంతి కీలకపాత్ర పోషిస్తున్న ఈ సినిమాకు 'మెరుపు' అనే టైటిల్ అనుకుంటున్నారు. ఇదిలావుంటే.. త్వరలో తన సొంత నిర్మాణ సంస్థ ఎన్టీఆర్ ఆర్ట్స్‌పతాకంపై 'కుమారి 21ఎఫ్' ఫేం సూర్య ప్రతాప్ దర్శకత్వంలో ఓ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ నిర్మించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇందులో ఆయనే హీరోగా కూడా నటిస్తారని తెలుస్తున్నది. ప్రస్తుతం సూర్యప్రతాప్ ఓటీటీ కోసం ఓ వెబ్ సిరీస్ చేసే పనిలో ఉన్నారు. ఆ తర్వాత కల్యాణ్‌రామ్ సినిమా చేస్తారని టాక్. ఈ సినిమా కథ, స్క్రీన్‌ప్లే, మాటలు కూడా సూర్య ప్రతాపే అందిస్తారట. ఎన్టీఆర్ 'దేవర' నిర్మాతల్లో కల్యాణ్‌రామ్ కూడా ఒకరిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే.

సోషియో ఫాంటసీ సుబ్రహ్మణ్య

తన తనయుడు అద్వయ్‌ని హీరోగా పరిచయం చేస్తూ.. నటుడు, ప్రముఖ డబ్బింగ్ ఆర్టిస్ట్ పి.రవిశంకర్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సుబ్రహ్మణ్య'. తిరుమలరెడ్డి, అనిల్ కడియాల ఈచిత్రానికి నిర్మాతలు. సోషియో ఫాంటసీ అడ్వంచర్ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-లుక్‌ను మేకర్స్ శనివారం రివీల్ చేశారు. అత్యున్నత సాంకేతిక విలువలతో ప్రేక్షకులకు విజువల్ ఫీస్ట్ అందించేలా ఈ చిత్రాన్ని రవిశంకర్ రూపొందిస్తున్నారని, ఇప్పటికే 60శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ముంబైలోని రెడ్ చిల్లీస్ స్టూడియోలో శరవేగంగా జరుగుతున్నది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నైల్లోని ప్రముఖ స్టూడియోలలో వీఎఫ్ఎక్స్, సీజీఐ పనులు జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: విఘ్నేష్ రాజ్, సంగీతం: రవి బస్రూర్, సమర్పణ: ప్రవీణ్ కడియాల, రామలక్ష్మి.

ఆ విషయంలో కాజోల్ నాకు స్ఫూర్తి

'నన్నెంతో ప్రభావితం చేసిన నటి కాజోల్. ఆమెను ప్రేరణగా తీసుకొని చాలా మంది హీరోయిన్లయ్యారు. వారిలో నేనూ ఒకదాన్ని' అంటున్నారు జాతీయ ఉత్తమనటి కృతి సనన్. కాజోల్‌తో కలిసి 'దో పత్తీ' అనే వెబ్‌సిరీస్‌లో నటించింది కృతి సనన్. ఈ సిరీస్ నిర్మాత కూడా తానే కావడం విశేషం. త్వరలోనే ఈ సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా కాజోల్‌తో తన అనుబంధం గురించి మాట్లాడింది కృతి సనన్. 'తొమ్మిదేండ్ల క్రితం 'దిల్‌వాలే' సినిమాలో కాజోల్ అక్కతో కలిసి నటించాను. అది నా రెండో సినిమా. సినిమాలపై పెద్దగా అవగాహన కూడా అప్పట్లో నాకు లేదు. సెట్‌లో ఎలా మాట్లాడాలో కూడా తెలీదు. ఆ సమయంలో అక్క నాకు అండగా నిలిచింది. ఎన్నో విషయాలు ఆమె వల్లే తెలుసుకున్నా. నటనా పరంగానే కాదు, వ్యక్తిత్వపరంగా కూడా కాజోల్ నాకు స్ఫూర్తి.' అని చెప్పుకొచ్చింది కృతి సనన్.

ఆవేశంగా.. అమాయకంగా

నిఖిల్ దేవాదుల హీరోగా నటిస్తున్న సినిమా 'ఘటికాచలం'. అమర్ కామెపల్లి దర్శకుడు. ఈ చిత్రానికి కథ, నిర్మాత ఎం.సి. రాజు. శనివారం ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఓ వైపు ఆవేశంగా, మరోవైపు అమాయకంగా రెండు డిఫరెంట్ లుక్స్‌లో హీరో నిఖిల్ దేవాదుల కనిపిస్తున్నారు. వైవిధ్యమైన కథాంశంతో కూడుకున్న సినిమా ఇదని, దానికి తగ్గట్టే పోస్టర్‌ని డిజైన్ చేశామని, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈటీవీ ప్రభాకర్, అర్విశాగుప్తా, జోగినాయుడు, సంజయ్‌రాయ్, చుర, దుర్గాదేవి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎస్.ఎస్.మనోజ్, సంగీతం: ప్లేవియో కుకురోలో, నిర్మాణం: ఒయాసిస్ ఎంటర్‌టైన్మెంట్స్.

యాడాది కిందట ఏం జరిగిందంటే..

రఘు గద్వాల్, ప్రియాంకశ్రీ, శివ ప్రసన్న ప్రధానపాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'వెంకటలక్ష్మీతో..' 'యాడాది కిందట' అనేది ఉపశీర్షిక. రామ్మూర్తి కొట్టాల దర్శకుడు. ఆలేటి రాజేశ్ నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ని హీరో శ్రీకాంత్ చేతులమీదుగా లాంచ్ చేశారు. సినిమా ఘన విజయం సాధించాలని శ్రీకాంత్ అభిలషించారు. థ్రిల్లర్, సస్పెన్స్ అంశాలతో కూడుకున్న స్వచ్ఛమైన ప్రేమకథ ఇదని, అందరూ కొత్తవాళ్లతో ఈ సినిమా చేశామని, ఆడియన్స్‌కి ఫ్రెష్ ఫీల్ కలుగుతుందని దర్శకుడు చెప్పారు. త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: రిషి, టి.మహిధర్, సంగీతం: సీఎన్ ఆదిత్య, నిర్మాణం: టింట్ స్ట్రీ స్టూడియోస్.

ప్రణయ గోదారిలో ప్రత్యేక గీతం

సదన్, ప్రియాంకప్రసాద్ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీఎల్‌వి క్రియేషన్స్ పతాకంపై పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమాలోని 'గు గు గ్గు...' అనే ప్రత్యేక గీతాన్ని కొరియోగ్రాఫర్ గణేష్ విడుదల చేశారు. ఈ పాటకు మార్కండేయ స్వరాలను సమకూర్చడంతో పాటు సాహిత్యాన్ని అందించారు. భార్గవి పిళ్లై ఆలపించింది. ఈ సినిమా ప్రచార చిత్రాలకు ఇప్పటికే మంచి స్పందన లభిస్తున్నదని, అందమైన ప్రేమకథగా అందరిని ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. సాయికుమార్, పృథ్వీ, జబర్దస్త్ రాజమౌళి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ, దర్శకత్వం: పీఎల్ విఘ్నేష్.